క్లుప్తంగా

సాత్విక్ సాయిరాజ్‌కు సత్కారం



సాత్విక్‌ను సత్కరిస్తున్న టీటీడీ ఎస్వీ బీసీ సలహాదారు దుర్గ తదితరులు

అమలాపురం టౌన్: ఏషియన్ గేమ్స్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకం సాధించిన రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను హైదరాబాద్ గచ్చిబౌలిలోని గోపిచంద్ అకాడమిలో కాట్రేనికోనకు చెందిన టీటీడీ ఎస్వీ బీసీ సలహాదారు అడపా దుర్గ ఆధ్వర్యంలో కోనసీమ మిత్రులు బుధవారం ఘనంగా సత్కరించారు. తొలుత ఆయనకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. అనంతరం సాత్విక్ సాయిరాజ్‌తో పాటు అతడి తల్లిదండ్రులు కాశీ విశ్వనాథ్, రంగమణిలను సత్కరించారు.

విశ్వాగ్ని శాంతి స్థూపం ఆవిష్కరణ



కాలభైరవ విశ్వాగ్ని శాంతి స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఆదిశేష నిలయంలో నిర్వహిస్తున్న పితృదేవతా పూజా మహోత్సవాల్లో భాగంగా 14 అడుగుల ఎత్తున్న కాలభైరవ విశ్వాగ్ని శాంతి స్థూపాన్ని ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ వేము శివకుమార్ బుధవారం ఆవిష్కరించారు. విశ్వాగ్ని శాంతి స్థూపానికి ఆస్ట్రేలియాకు చెందిన కంతమణి ప్రభాకర్ రూ.40 వేలు, ఓ అజ్ఞాత కుటుంబం రూ.25 వేలు, మోపిదేవి విశ్వేశ్వరరావు రూ.16 వేలు, అన్నదాన నిమిత్తం ఓ భక్తుడు రూ.10 వేలు, అడపా వెంకట సుబ్రహ్మణ్యం రూ.7 వేలు, సలాది దొరయ్యనాయుడు రూ.5 వేలు, ఈతకోట సత్యనారాయణ, చిక్కం విజయలక్ష్మి, త్సవటపల్లి శ్రీనివాసరావు రూ.3 వేల వంతున విరాళాలు సమకూర్చారు.

పైపులైన్ విస్తరణ పనులు ప్రారంభం



తిళ్లకుప్పలో తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

ఐ.పోలవరం: మండలంలోని తిళ్లకుప్ప జగనన్న హౌసింగ్ కాలనీలో తాగునీటి పైపులైన్ విస్తరణ పనులకు ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు బుధవారం కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మోర్తరాణి మిరియంజ్యోతి మాట్లాడుతూ రూ.18.90 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో పైప్‌లైన్ విస్తరణ పనులు చేపట్టామన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడియం తమ్మయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, మోకా రవి, రేవు సత్యనారాయణ, శీలం వెంకట్రావు, పి.బాబ్జిరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం రవాణాను అదుపు చేయాలి



పాతయింజరం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా

ఐ.పోలవరం: యానాం నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యం రవాణాను అదుపు చేయాలని పోలీసులకు అడిషనల్ ఎస్పీ ఖాదర్ బాషా సూచించారు. పాతయింజరం ఎక్సైజ్ చెక్ పోస్టును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం హైవే రహదారిపై చెక్ పోస్టు సిబ్బంది పనితీరును పరిశీలించి తగు సూచనలిచ్చారు. ఇటీవల కాలంలో యానాం మద్యం అక్రమ రవాణా పెరిగిందని, దాన్ని పూర్తిగా నియంత్రించాలని ఆదేశించారు. ఆయన వెంట స్టేషన్ ఎస్ఐ రాజేష్, ఎక్సైజ్ పోలీసులున్నారు.

ఘనంగా నవరాత్రుల అన్నసమారాధన

యానాం: యానాం పట్టపరిధిలోని భీమ్‌నగర్‌లో గణపతి నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. చారిత్రక పిల్లారాయ(లక్ష్మీగణపతి) ఆలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధనకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం వచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భీమ్‌నగర్ వద్ద అన్నసమారాధనలో మల్లాడి సత్తిబాబు, గుత్తుల రామారావు, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు, మల్లాడి బీరాస్వామి, లంక చంద్రరావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్



పేరూరు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: ఆరోగ్యవంతమైన సమాజమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బుధవారం మండలంలోని పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన వారితో మంత్రి ముఖాముఖి మాట్లాడారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య వైద్యకు పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, సర్పంచ్ దాసరి అరుణకుమారి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, వాసు నాయక్, ములపర్తి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని గోగుల్లంక సర్పంచ్ కాకర్లపూడి గీతాదేవి అన్నారు. బుధవారం గోగుల్లంక సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 452 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ ఝాన్సీకుమారి, జొన్నాడ జ్యోతి, ఈతకోట సత్యనారాయణ, లంకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: పేదల ఆరోగ్యానికి జగనన్న సురక్ష భరోసానిస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శివశంకరరావు అన్నారు. మండలంలోని అనాతవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆయన ప్రారంభించారు. శిబిరంలో 521 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఈఓపీఆర్డీ సీహెచ్ఎల్ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: మండలంలోని తూర్పులంక పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైద్యులు స్పందన, సీలోఫర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, సర్పంచ్ కడలి గంగాచలం, డీటీ వీర వెంకట సత్యనారాయణ, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: జగనన్న ఆరోగ్య సురక్షతో అందరి ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు అన్నారు. బుధవారం నీలపల్లి హైస్కూల్‌లో జరిగిన సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిబిరంలో సుమారు 400 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టూరి కలికిమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు దంగేటి సూరిబాబు, రెడ్డి సతీష్, రేవు మల్లీశ్వరి, మోకా మధుబాబు, కట్టా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటింటా ఆరోగ్యమేనని సర్పంచ్ నాతి అలివేణి అన్నారు. పల్లంకుర్రు సచివాలయం-2 సాపేవారిపల్లి జెడ్పీహెచ్ పాఠశాల వద్ద ఆమె అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. శిబిరంలో రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచలం, తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌బీకే చైర్మన్ నాతి సత్యనారాయణ, పల్లంకుర్రు పీహెచ్‌సీ వైద్యురాలు స్వాతి, మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గోగుల్లంకలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు



తూర్పులంక ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ స్పందన



నీలపల్లిలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న నేతలు

శ్రేయ దివ్యాంగుల పాఠశాల సేవలు అభినందనీయం



సక్షమ్ జాతీయ అధ్యక్షుడు గోవిందరాజును సత్కరిస్తున్న డాక్టర్ శ్రీమన్నారాయణ తదితరులు

అమలాపురం టౌన్: దివ్యాంగ విద్యార్థుల కోసం శ్రేయ ప్రత్యేక దివ్యాంగుల విద్యా పాఠశాల అందిస్తున్న సేవలు అభినందనీయమని సక్షమ్(సమదృష్టి సమతా వికాసం-అనుసంధాన మండలి) జాతీయ అధ్యక్షుడు, తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన ఎస్.గోవిందరాజు అన్నారు. శ్రేయ దివ్యాంగ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం గోవిందరాజును డాక్టర్ కొత్తూరి శ్రీమన్నారాయణ, ప్రిన్సిపాల్ కొర్లపాటి దశరథరామయ్యలు సత్కరించారు. కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణమూర్తి, కృష్ణమోహన్, డాక్టర్ గోదశి గంగరాజు, నిమ్మకాయల సురేష్, శిష్టా శ్రీహరి, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు తరలి రావాలి

ముమ్మిడివరం: ఆదుర్రు బౌద్ధ స్థూప ప్రాంగణంలో ఈ నెల 14న జరిగే బౌద్ధ దమ్మదీక్ష ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా పిలుపునిచ్చింది. మండలంలోని అన్నంపల్లిలో కాశి వెంకట రమణ అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బౌద్ధ ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పుల్లెపు వెంకటేశ్వరరావు, కేఎస్ఎన్‌మూర్తి, కొమ్మాబత్తుల రఘు, సఖిలే పృథ్వీరాజ్, బి.శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భవను సద్వినియోగం చేసుకోవాలి



ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే పొన్నాడ

ముమ్మిడివరం: పేదలకు అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యం అందించేందుకు ప్రభుత్వం అమలుచేస్తున్న ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఏర్పాటుచేసిన ఆయుష్మాన్ భవ ఆరోగ్య మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.దయానా అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు రోగులకు సేవాభావంతో వైద్యం అందిస్తున్నారన్నారు. అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు ఆరోగ్య మేళాలో ఉచితంగా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పెన్మత్స చిట్టిరాజు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, రెడ్డి శివన్నారాయణ, డా.అనిల్ కుమార్, డా.శృతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్
- గూడాలలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ని లబ్ధిదారులకు అందిస్తున్న పినిపే శ్రీకాంత్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో అర్హులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని గూడాలలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. రాబోయో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాల్సిన బాధ్యత లబ్ధిదారులందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ పాటి శ్రీరామ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పరమట శ్రీను, బళ్ల శ్యామ్, ఉండ్రు బాబ్జి, సంతోష్, మట్టపర్తి సత్తిబాబు, జల్లి శ్రీను పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీ, పురుషులు సమానమే



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారి భరతలక్ష్మి

ముమ్మిడివరం: సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, స్త్రీలను ఏవిషయంలోనూ తక్కువగా చూడకూడదని అడిషనల్ జిల్లా వైద్యాధికారి భరతలక్ష్మి పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పీపుల్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, యువ భారత్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక గురుకుల పాఠశాలలో టి.నాగరాజారావు అధ్యక్షతన బుదవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ విమల, ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కన్నీడి వెంకటేశ్వరరావు, బీవీ సత్యనారాయణ, ప్రిన్సిపల్ గంగా భవాని, వి.హరీష్, పుల్లెపు వెంకటేశ్వరరావు, కె.వరప్రసాదరావు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని జనుపల్లిలోని ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ జిల్లా కోఆర్డినేటర్ బి.అనంతలక్ష్మి బాలికా విద్య ప్రాముఖ్యతను వివరించి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కె సత్యవాణి, ఎస్ఎం సత్యశ్రీ, దీపిక, సీహెచ్ఓ వి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ చిన్నవరాజు

ఉప్పలగుప్తం: సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి 100 శాతం కృషి చేస్తున్నానని సర్పంచ్ కడిమి చిన్నవరాజు అన్నారు. ఉప్పలగుప్తం పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత జనవరిలో ఏటిమెర ప్రాంతవాసులు స్థానికంగా అభివృద్ధి జరగడం లేదంటూ ఓఎన్జీసీ వాహనాలను అడ్డుకున్నారన్నారు. దీంతో సర్పంచ్‌గా తనను పిలిచి ఓఎన్జీసీ నుంచి నిధులు వచ్చేలా చూస్తానని కలెక్టర్ శుక్లా చెప్పారన్నారు. గ్రామంలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలకు మొత్తంగా రూ.23 లక్షలు ఓఎన్జీసీ ద్వారా అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఆయా పనులు జరుగుతున్నాయని, నిధులన్నీ నేరుగా కాంట్రాక్టరు ఖాతాకే వెళతాయన్నారు. సర్పంచ్‌గా గ్రామస్తులకు, అధికారులకు సయోధ్య కుదర్చడం వరకే తన పాత్ర తప్ప నిధులతో తనకెలాంటి సంబంధం లేదన్నారు. సమావేశంలో మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, నడింపల్లి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాపై విచారణ చేయాలి

యానాం: పుదుచ్చేరి మంత్రిగా సేవలందించిన చంద్రప్రియాంక రాజీనామాకు దారితీసిన పరిస్థితులపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయాలని వీసీకే పార్టీ ఎంపీ తిరుమావళవన్, ప్రధాన కార్యదర్శి దేవా పోజిలన్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కుల, లింగపరమైన వివక్ష వల్లే తాను మంత్రి పదవికి రాజీనామా చేశానంటూ ఆమె బహిరంగంగా చెప్పారని, మహిళా మంత్రికే ఇంత అవమానం జరిగితే సామాన్యుల పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఉప్పలగుప్తం: మండలంలోని వాసాలతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కర్రి నరసింహ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కామన మధుసూదనరావు బుధవారం తెలిపారు. ఇటీవల కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్-14 విభాగంలో నరసింహ ప్రతిభ చాటాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నరసింహను హెచ్ఎం ఎస్వీవీ సత్యనారాయణ, పీడీ సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవాలు



గోడిలంకలో ఎస్సీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి విశ్వరూప్



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. రూ.25 లక్షలతో నిర్మించిన గోడిలంక సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌తో కలిసి మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం ప్రారంభించారు. గోడిలంక ఎస్సీ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బెండమూర్లంక సచివాలయ పరిధిలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అల్లవరం సీహెచ్‌సీ ఆస్పత్రి నిర్మాణానికి స్థలం సమకూర్చిన సూర్యనారాయణరాజుని మంత్రి విశ్వరూప్ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు బాపూజీ, సర్పంచ్ రుద్రరాజు పవిత్ర, సర్పంచ్ బర్రే సీతారత్నం, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, ముత్యాల వెంకటరామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సొసైటీ చైర్మన్లు యల్లమిల్లి బోసు, గుర్రం బాబులు, నాతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

84 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 84 మందికి ఇళ్ల పట్టాలను మంత్రి విశ్వరూప్ బుధవారం అందజేశారు. అల్లవరంలో తహసీల్దార్ సాంబశివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఇళ్ల స్థలాల పంపిణీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఏఓ ఎస్వీవీ సత్యనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శులు రాజమోహన్, కేవీవీ సత్యనారాయణ, చిక్కం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణకు దిగిన విద్యార్థులకు కౌన్సిలింగ్

అమలాపురం టౌన్: స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాలకు చెందిన కొందరు విద్యార్థులు కేవలం తుంటరి చర్యలతోనే రెండు వర్గాలుగా వీడి ఘర్షణకు దిగారే తప్ప ఇందులో మరో కోణం లేదని డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ బుధవారం స్పష్టం చేశారు. ఘర్షణకు దిగిన విద్యార్థులను పిలిపించి వారి తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చామని ఆయన చెప్పారు. కళాశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న స్వల్ప వివాదం వల్లే కళాశాల బయటకు వచ్చాక ఘర్షణకు దిగారని చెప్పారు. విద్యార్థుల ఘర్షణపై కొన్ని ప్రచార మాధ్యమాల్లో పలు రకాలుగా ప్రసారం చేయడాన్ని ఆయన ఖండించారు. ఘటనలో ఉన్న నలుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకుని విచారించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశామని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కళాశాల యాజమాన్యానికి సూచించామన్నారు. విద్యార్థులు దుందుడుకు చర్యలకు పాల్పడితే సహించిలేదని హెచ్చరించారు.

కేంద్రం కౌలు రైతులను ఆదుకోవాలి



రాష్ట్ర కౌలు రైతుల సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావులు డిమాండు చేశారు. అమలాపురం షాదీఖానా భవనంలో బుధవారం జరిగిన రాష్ట్ర కౌలు రైతుల సదస్సులో వారిద్దరూ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కౌలు రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌలు రైతుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, విస్సా కిరణ్‌కుమార్, అంద్ర మాల్యాద్రి, ఎం.హరిబాబు, మిరియం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు శివన్నారాయణకు సత్కారం

తాళ్లరేవు: ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణను స్థానిక సూర్యభాస్కర కల్యాణ మండపంలో గురువారం సత్కరించనున్నట్లు తాళ్లరేవు శెట్టిబలిజ సంఘం ప్రతినిధులు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు హాజరవుతారన్నారు.

ఆదర్శ యానాం నిర్మాణమే లక్ష్యం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



కనకాలపేట వాటర్‌వర్క్స్ వద్ద సంపు నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

యానాం: ఆదర్శ యానాం నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానికంగా వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కనకాలపేట వాటర్ వర్క్స్ వద్ద రూ.55.54 లక్షలతో నిర్మించనున్న వాటర్ స్టోరేజ్ సంపు, గోపాల్‌నగర్ అంబేడ్కర్ విజ్ఞాన్‌భవన్‌లో రూ.25 లక్షలతో చేపట్టిన టాయ్‌లెట్స్, రూ.30 లక్షలతో చేయనున్న గోపాల్‌నగర్ వాటర్‌ప్లాంట్ అభివృద్ధి పనులు, రూ.27.42 లక్షలతో నిర్మించనున్న కామరాజ్‌నగర్ సీసీ రోడ్డు, రూ.12 లక్షలతో మెట్టకూరు వాటర్‌వర్క్స్ పనులు, రూ.15 లక్షలతో రక్షాహరికృష్ణ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.46 లక్షలతో మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర స్కూల్‌లో రెండో ఫ్లోర్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా స్టాంపుల ప్రదర్శన



స్టాంపుల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: తపాలా వారోత్సవాల్లో భాగంగా స్థానిక వడ్డిగూడెంలోని శ్రీవాగ్దేవి స్కూలులో తపాలా స్టాంపుల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ బుధవారం ఏర్పాటుచేసిన స్టాంపుల ప్రదర్శన విజ్ఞానదాయకంగా సాగింది. విద్యార్థులు దేశ విదేశాల స్టాంపులను తిలకించి అవగాహన పెంచుకున్నారు. పురాతన స్టాంపులతో పాటు మినియేచర్ సీట్లను ప్రదర్శనలో ఉంచారు. కృష్ణ కామేశ్వర్‌ను తపాలాశాఖ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తపాలా అధికారులు అమర్నాథ్, రవి, శ్రీవాగ్దేవి స్కూలు డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



జనుపెల్లి బాలికల వసతి గృహంలో టీవీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం జనుపెల్లి ప్రభుత్వ ఆనంద నిలయం బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. రూ.52 వేల విలువైన క్రీడా కిట్లు, టెలివిజన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి శారీరక దృఢత్వాన్ని పెంచేందుకు అందించిన క్రీడా సామగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకునేందుకు టెలివిజన్‌ను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఎం.జ్యోతిలక్ష్మీదేవి, జిల్లా సంక్షేమ అధికారి కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలి

తాళ్లరేవు: ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఎంపీపీ రాయుడు సునీత, ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు హితవు పలికారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఇటీవల జరిగిన పలు అంశాలపై చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు సైతం సహకరించాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ చిట్టూరి నాగమణి, మాజీ సర్పంచ్‌లు రేవు మల్లీశ్వరి, ర్యాలి సత్యనారాయణ, ఎంఈఓ-2 మోకా ఉమ, పంచాయతీ కార్యదర్శి ఎస్.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.